

శాకంబరీదేవిగా భ్రమరాంబిక

ఆషాఢ మాసం సందర్భంగా చేవెళ్ల పట్టణ కేంద్రంలోని కొనగట్టు శివాలయంలోని భ్రమరాంబిక దేవి శుక్రవారం శాకంబరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా మహిళలు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

చేవెళ్ల, జూలై 18 (ఆంధ్రజ్యోతి)

నేడు శంకర్‌పల్లికి కేంద్ర రైల్వేమంత్రి రాక

శంకర్‌పల్లి, జూలై 18(ఆంధ్రజ్యోతి): కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ నేడు(శనివారం) శంకర్‌పల్లికి రానున్నారు. సంగారెడ్డి జిల్లా కందిలోని ఐఐటీ హైదరాబాద్‌లో జరిగే కాన్వకేషన్ కార్యక్రమం ముగించుకొని శంకర్‌పల్లికి రానున్నట్లు సమాచారం. శనివారం ఉదయం 10 గంటలకు ఆయన ఐఐటీకి చేరుకొని 10.40 గంటల వరకు జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు. తదనంతరం రోడ్డు మార్గంలో శంకర్‌పల్లికి చేరుకొని రైల్వేస్టేషన్‌లో ప్రత్యేక రైలు ఎక్కి నగరానికి వెళ్లనున్నారు. కాగా, అశ్వినీ వైష్ణవ్ శంకర్‌పల్లికి వస్తున్న నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం డివిజనల్ రైల్వే మేనేజర్(డీఆర్ఎం) టీకే జైన్ శుక్రవారం శంకర్‌పల్లి రైల్వేస్టేషన్‌లో అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు.



కొంగరకలాన్ నుంచి ఎలిమినేడు వెళ్లే దారిలో ఉప్పొంగుతున్న వాగు

కరుణించిన వరుణుడు

ఉమ్మడి జిల్లాలో విస్తారంగా వర్షాలు

కొద్ది రోజులుగా దోబూచులాడుతున్న వరుణుడు ఎట్టకేలకు కనికరించాడు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం తెల్లవారు జాము నుంచి పలు ప్రాంతాల్లో కుండపోతగా వానలు కురుస్తున్నాయి. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. వాగుల్లో వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. గడిచిన 24 గంటల్లో రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి వెల్జాలలో అత్యధికంగా 150 మి.మీ వర్షపాతం నమోదైంది. మేడ్చల్ జిల్లా బాలానగర్ మండలం బోయినపల్లిలో అత్యధికంగా 114.5మి.మీ వర్షం కురిసింది. అలాగే వికారాబాద్ జిల్లాలో అత్యధికంగా నవాబ్‌పేట్‌లో 89.0మి.మీ. వర్షం కురిసింది.

జలమయమైన లోతట్టు ప్రాంతాలు

- ఆరుతడి పంటలకు జీవం పోసిన వాన
- హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు
- నగర శివార్లలోని పలు కాలనీల్లోని ఇళ్లలోకి నీరు
- వెల్జాలలో అత్యధికంగా 150మి.మీ వర్షపాతం
- మరో రెండు రోజుల పాటు వర్ష సూచన

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి)

ఉమ్మడి జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వాగులు, వంకలు నీటితో పరవళ్లు తొక్కుతున్నాయి. కొద్ది రోజులుగా వర్షాల కోసం రైతులు ఎదురుచూస్తున్న సంగతి తెలిసిందే. వానాకాలం ఆరంభంలో వేసిన పంటలు వర్షాలు లేక ఎండిపోతున్న తరుణంలో ఇపుడు కురుస్తున్న వర్షాలు ఊపిరి పోశాయి. ముఖ్యంగా పత్తి, మొక్కజొన్న పంటలు వేసిన రైతులు ఊరట చెందుతున్నారు. విస్తారంగా వర్షాలు

మిగతా 5వ పేజీలో...



చేవెళ్ల ప్రభుత్వ బాలుర వసతి గృహం ఆవరణలో నిలిచిన వర్షం నీరు



కొంగరకలాన్‌లోని ఓ ఇంట్లోకి చేరిన వర్షం నీరు

పెద్దషాపూర్‌లో 109.5మి.మీ

గడిచిన 24 గంటల్లో రంగారెడ్డి జిల్లాలోని శంషాబాద్ మండలం పెద్దషాపూర్‌లో 109.5మి.మీ, చేవెళ్ల మండలం ధర్మసాగర్‌లో 108.8 మి.మీ, మంచాల మండలం ఆరుట్లలో 108.5 మి.మీ, షాద్‌నగర్‌లో 108.8 మి.మీ, యాచారం మండలం గున్‌గల్‌లో 99 మి.మీ, మంచాల మండలం బోడకొండలో 97 మి.మీ వర్షం కురిసింది. ఇబ్రహీంపట్నం మండలం కొంగరకలాన్‌లో 96.3 మి.మీ, మంగలపల్లిలో 96.5మి.మీ, ఆమనగల్లులో 83.8మి.మీ, రాజేంద్రనగర్‌లో 83.3మి.మీ, మాడ్గుల మండలం ఆర్కపల్లిలో 81.3 మి.మీ, షాబాద్‌లో 80.5 మి.మీ, బాలాపూర్ మండలం మామిడిపల్లిలో 76మి.మీ, శేరిలింగంపల్లిలో 79 మి.మీ, కడ్తాల్ మండలం ముద్విన్‌లో 72 మి.మీ వర్షపాతం నమోదైంది.



డీలర్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతులు

అధిక ధరలపై రైతుల గగ్గోలు

- పురుగుల మందు రేటు పెంచి విక్రయం
- కేశంపేటలో ఆందోళన..షాపుపై చర్యలకు డిమాండ్
- ఏవో శిరీష హామీతో ఆందోళన విరమణ

కేశంపేట, జూలై 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తూ జీరో బిల్లులతో అధిక ధరలకు పురుగుల మందులు విక్రయించడంపై కేశంపేట రైతులు కన్నెర్ర చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. వివరాల్లో వెళ్తే.. మండల కేంద్రంలో శ్రీనివాసస్ నాగలి పెస్టిసైడ్, ఫర్టిలైజర్ షాపులో కేశంపేట గ్రామానికి చెందిన చిర్ర యాదయ్య, మరి కొందరు రైతులు పురుగుల మందుతో పాటు నానో డీఏపీని కొనుగోలు చేశారు. ఇక్కడ లీటర్ నానో డీఏపీ రూ.500కు డీలర్ విక్రయించాడు. అదే లీటర్ నానో డీఏపీని మరో షాపులో కొనుగోలు చేస్తే అక్కడ రూ.350కే ఇచ్చారు. రూ.150 అదనంగా తీసుకోవడంపై శ్రీనివాసస్ షాపు నిర్వాహకుడిని రైతులు నిలదీశారు. దీంతో డీలర్ దురుసు సమాధానం ఇవ్వడంతో పాటు షాపు దగ్గర నుంచి వెళ్లిపోవాలంటూ దుర్భాషలాడాడు. ఆగ్రహించిన రైతులు దుకాణం ఎదురుగా కేశంపేట- షాద్‌నగర్ ప్రధాన రహదారిపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఏవో శిరీష వచ్చి సమాధానం చెప్పాలని, షాపు యజమానిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ఏవో సంఘటనా స్థలానికి చేరుకుని రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటానని చెప్పారు. అయినా వినకపోవడంతో పోలీసులు రంగ ప్రవేశం చేశారు. రోడ్డుపై ఆందోళనలు, బైఠాయింపులు చేయరాదని, ఏమైనా ఉంటే ఫిర్యాదు చేయాలని సూచించారు. వారి సూచన మేరకు ఆందోళన విరమించిన రైతులు.. ఏవో కార్యాలయంలో, స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఎన్కేపల్లి రైతులకు అన్యాయం చేస్తే ఊరుకోం

- సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య



రైతులతో మాట్లాడుతున్న యాదయ్య

మొయినాబాద్ రూరల్, జూలై 18(ఆంధ్రజ్యోతి): ఎన్కేపల్లిలో ఎన్నో ఏళ్లుగా రైతులు సాగు చేసుకుంటున్న భూములను లాక్కోవాలని చూస్తే ఊరుకునేది లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య హెచ్చరించారు. శుక్రవారం గ్రామంలోని ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. ఎన్కేపల్లి రైతులకు న్యాయం జరిగేవరకు పార్టీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో అల్లి దేవేందర్, ప్రవీన్‌కుమార్, శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్, వెంకటయ్య, అగ్రవల్లి శ్రీనివాస్, అరుణ్ కుమార్, చరణ్ గౌడ్, రేష్వంత్ పాల్గొన్నారు.

ఔటర్‌పై మృత్యుఘోష

ఔటర్ రింగ్ రోడ్డు మృత్యు పాశంగా మారింది. రోజూ ఏదో ఒక చోట ప్రమాదం జరుగుతూనే ఉంది. ఇతర ప్రాంతాలకు ట్రాఫిక్ లేకుండా సులభంగా వెళ్లేందుకు చాలామంది వాహనదారులు ఔటర్‌ను ఆశ్రయిస్తున్నారు. అయితే అతివేగం, నిర్లక్ష్యం చాలా కుటుంబాలను వీధిపాలు చేస్తోంది. మరికొందరు మద్యం సేవించి వాహనాలు నడుపుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు. శుక్రవారం తెల్లవారు జామున ఓఆర్ఆర్ ఎగ్జిట్ 12 సమీపంలో జరిగిన ప్రమాదంలో ఐదుగురు మృత్యువాత పడ్డారు.

- ప్రాణాలు తీస్తున్న అతివేగం, నిర్లక్ష్యం
- శుక్రవారం తెల్లవారు జామున జరిగిన ప్రమాదంలో ఐదుగురి మృతి

వరుస ప్రమాదాలతో వాహనదారుల బెంబేలు





మృతుల కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న డీసీపీ సునీతారెడ్డి

ఇబ్రహీంపట్నం/ ఆదిభట్ల, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఔటర్ రింగ్ రోడ్డుపై జరుగుతున్న ప్రమాదాలు వాహనదారులను బెంబేలెత్తిస్తున్నాయి. శుక్రవారం తెల్లవారుజామున జరిగిన ఘోర ప్రమాదం ఐదు కుటుంబాల్లో తీరని శోకాన్ని నింపింది. వివిధ జిల్లాల నుంచి పొట్టకూటి కోసం వలస వచ్చిన వారిని రోడ్డు ప్రమాదం కబళించింది. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ ఎన్కేపల్లిలోని గ్రీన్‌వ్యాలీ రిసార్ట్‌లో కుటుంబ సభ్యులతో నివాసముంటున్న వీరు స్నేహితులయ్యారు. యాదగిరి లక్ష్మీనృసింహస్వామి దర్శనం చేసుకోవాలని బయల్దేరిన వీరు మధ్య నుంచే తిరుగు ప్రయాణమయ్యారు. గురువారం రాత్రి మూడు గంటల ప్రాంతంలో బొంగులూరు ఓఆర్ఆర్ ఎగ్జిట్ 12 సమీపంలోని మైల్‌స్టోన్ 101 దగ్గర ముందు వెళ్తున్న లారీని వీరు ప్రయాణిస్తున్న కారు అతివేగంగా ఢీ కొట్టడంతో అందులో ప్రయాణిస్తున్న ఐదుగురు మృతిచెందారు. దీంతో ఆ కుటుంబాల్లో తీవ్ర విషాదం నింపింది. మృతుల్లో ఒక్కొక్కరిది ఒక్కో దీన గాథగా ఉంది. మృతులందరివీ పేద కుటుంబాలే. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం దాసరితండాకు చెందిన గుగులోత్ జనార్దన్‌కు భార్య షైబూ, కూతురు సునీత ఉన్నారు. సునీత బీటెక్ మొదటి సంవత్సరం చదువుతోంది. వరంగల్ జిల్లా పాకాలకు చెందిన మాలోత్ చందులాల్‌కు భార్య దేవి ఉంది. అలాగే శ్రీకాకుళం జిల్లా వేదులవలస గ్రామానికి దాసరి భాస్కర్‌రావు ఇదే రిసార్టులో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. విజయనగరం జిల్లా తెర్లాం మండలం కల్మరాజుపేట గ్రామానికి చెందిన జాడ కృష్ణ(25) డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. భాస్కర్‌రావు, కృష్ణలు ఇక్కడ ఒంటరిగా ఉంటున్నారు. కాగా మొయినాబాద్ మండలం ఎన్కేపల్లికి చెందిన కావలి బాల్‌రాజ్ ఇదే రిసార్టుకు చికెన్ సరఫరా చేస్తుంటాడు. ఆయనకు

మిగతా 5వ పేజీలో...



నడి రోడ్డులో నీటి గుంత

- నాట్లు వేసి నిరసన తెలిపిన బీజేపీ నేతలు

ఇబ్రహీంపట్నం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి రాయపోల్ ప్రధాన రోడ్డు గుంతలమయంగా మారింది. రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని శుక్రవారం బీజేపీ నాయకులు వరి కర్రలు నాటి నిరసన తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు గోదల శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ రోడ్డు సమస్యను నెలక్రితం ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తే.. రెండు రోజుల్లో పరిష్కరిస్తామని చెప్పి నేటికీ పట్టించుకోలేదన్నారు. మాజీ ఎంపీటీసీ దొండ విష్ణువర్దన్‌రెడ్డి, సత్యనారాయణ, రావుల మల్లేష్, నర్సింహ, ప్రవీన్, కార్తీక్ ఉన్నారు.



వైభవంగా బోనాలు

5

- అమ్మకు నైవేద్యం సమర్పణ
- మొక్కులు చెల్లించుకున్న భక్తులు
- పల్లెల్లో ఉప్పొంగిన భక్తిభావం

మహిళల కోసం పరిశ్రమలు ఏర్పాటు చేయాలి

మహిళా శక్తి సంబురాలలో ఎమ్మెల్యే సబితారెడ్డి



మహిళా సంఘాలకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

కందుకూరు, జూలై18 (ఆంధ్రజ్యోతి): మహిళలు పారిశ్రామిక రంగాల్లో రాణించడానికి ఫ్యూచర్ సిటీలో వంద ఎకరాలను కేటాయించి పరిశ్రమలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే పి.సబితారెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో మహిళా శక్తి సంబురాలు నిర్వహించారు. కందుకూరు, మహేశ్వరం మండలాలకు చెందిన డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ రెండు మండలాల్లోని మహిళా సంఘాలకు రూ.2కోట్ల 9లక్షల రూపాయలను మంజూరు చేసినట్లు గుర్తు చేశారు. గత ఐదేళ్లుగా మహిళా సంఘాల నుంచి వడ్డీని వసూలు చేసిన ప్రభుత్వం.. స్థానిక సంస్థల ఎన్నికలు రాబోతున్న నేపథ్యంలో కేవలం రెండేళ్లకు సంబంధించిన వడ్డీని మాత్రమే మంజూరు చేయడం ఏమిటని ప్రశ్నించారు. మిగిలిన మూడేళ్లకు సంబంధించిన వడ్డీని కూడా మంజూరు చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేస్తామన్న హామీ ఏమైందన్నారు. అబద్ధపు హామీలతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మరోసారి మోసం చేసిందన్నారు. అనంతరం కందుకూరు మండలానికి చెందిన 1152 సంఘాలు, మహేశ్వరం మండలానికి చెందిన 914 సంఘాలకు రూ.2 కోట్ల 9లక్షల వడ్డీ మాఫీ చెక్కును అందజేశారు. కార్యక్రమంలో మహేశ్వరం మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.కృష్ణానాయక్, డీపీఎం యాదయ్య, ఏపీఎంలు కవిత, సత్యనారాయణ, ఎంపీవో గీత, మహిళా సంఘాల అధ్యక్షురాలు ధనలక్ష్మి, కవిత, శ్యామల, నాయకులు లక్ష్మీనర్సింహ్మారెడ్డి, సురేందర్‌రెడ్డి, కాకి దశరథ, మేఘనాథ్‌రెడ్డి, ఎస్.రాజశేఖర్‌రెడ్డి, టి.ఇందిర, దేవేందర్, చంద్రశేఖర్, పర్వతాలు, శ్రీనివాస్, సురేష్, బర్కం వెంకటేష్, కార్తీక్, దీక్షిత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా పథకాలు అమలు చేయాలి

- దిశ సమావేశంలో చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి
- హాజరైన కలెక్టర్ నారాయణరెడ్డి, ఎమ్మెల్యేలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి, పక్కన కలెక్టర్, ఎమ్మెల్యే

రంగారెడ్డి అర్బన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను పకడ్బందీగా అమలు చేయాలని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులతో పనులు, పథకాలు అమలుపై కలెక్టర్ సి.నారాయణరెడ్డితో కలిసి ఎంపీ సమీక్షించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు, వాటి ప్రయోజనాలు, ఎంత సబ్సిడీ అందుతుందనేది ఎప్పటికప్పుడు సంబంధిత శాఖల అధికారులు తెలుసుకోవాలన్నారు. ప్రభుత్వ పథకాలపై సభల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

పుట్టగొడుగుల సాగుపై అవగాహన..

జిల్లాలో పుట్టగొడుగుల పంట సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. చేవెళ్ల మండలం చనువల్లి, ఇక్కారెడ్డిగూడ ప్రాంతంలో గాలివానకు ధ్వంసమైన పాలీహౌస్‌ల పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులను ఆదేశించారు. కిసాన్ సమ్మాన్ డబ్బులు రైతుల ఖాతాలో

మిగతా 6వ పేజీలో...

రుణాలు విరివిగా ఇవ్వాలి

బ్యాంకు రుణాల విషయంలో చాలా ఫిర్యాదులు వస్తున్నాయని, జిల్లాలో కేటాయించిన లక్ష్యానికి అనుగుణంగా రుణాలను అందించాలని ఎంపీ బ్యాంకర్లను ఆదేశించారు. ముద్ర, విశ్వకర్మ పథకాలతో పాటు చిరు వ్యాపారులు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు దరఖాస్తు చేసుకున్న వారికి సత్వరమే రుణాలు అందేలా చొరవ తీసుకోవాలని ఎంపీ ఆదేశించారు. జిల్లాలో అసంపూర్తిగా ఉన్న ప్రధాన, ఇతర రహదారులను పూర్తి చేయాలని, చిన్న చిన్న మరమ్మతులు ఉంటే వెంటనే చేపట్టాలని ఎంపీ సంబంధిత శాఖల అధికారులకు తెలిపారు. అనంతరం చేవెళ్ల, రాజేంద్రనగర్ ప్రాంత రైతుల కోసం మిల్క్‌సెంటర్ ఏర్పాటు చేయాలని దిశ కమిటీ సభ్యులు ఎంపీకి విన్నవించారు.

ఇద్దరే ఎమ్మెల్యేలు హాజరు!

దిశ సమావేశానికి ఇద్దరు ఎమ్మెల్యేలు మాత్రమే హాజరయ్యారు. మిగతా ఎమ్మెల్యేలు డుమ్మా కొట్టారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి వచ్చారు. కాలె యాదయ్య తన నియోజకవర్గానికి సంబంధించిన సమస్యలను ఎంపీ, కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. కసిరెడ్డి వేదికపై 5నిమిషాలు కూర్చొని తర్వాత వెళ్లిపోయారు. సమావేశం జరుగుతున్నప్పుడు నాలుగు సార్లు కరెంట్ కట్ అయ్యింది.

వేంకటేశుడికి రూ.100 కోట్లు



ఫుడ్ మేళాను పరిశీలిస్తున్న మెప్మా పీడీ రవికుమార్

అట్టహాసంగా ఫుడ్ మేళా

తాండూరు, జూలై 18(ఆంధ్రజ్యోతి): జీడి పప్పు స్వీట్లు, పూతరేకులు, పప్పులతో తయారు చేసిన తిను బండరాలతోపాటు పేపర్ హ్యాండ్ క్రాఫ్ట్ బ్యాగులు రకరకాల పసందైన వంటకాలతో ఫుడ్ మేళాను అట్టహాసంగా నిర్వహించారు. తాండూరు మున్సిపాలిటీ, మెప్మా విభాగం కలిసి తులసీ గార్డెన్‌లో ఫుడ్ మేళాను నిర్వహించారు. ఈ ప్రదర్శనలో 70 స్టాల్స్‌ను ప్రదర్శించారు. తాండూరు పట్టణానికి చెందిన ఇందిర మహిళా శక్తి పథకం కింద రుణాలు పొందిన ఎస్‌హెచ్‌జీ మహిళలు కేంద్ర ప్రభుత్వం అందించే స్ట్రీట్ వెండర్స్ పొందిన రుణాల ద్వారా నెలకొల్పిన యూనిట్లను ప్రదర్శించారు. పలువురు మహిళలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌లో వంటకాలు మైమరిపించాయి. ఈ స్టాల్స్‌ను మెప్మా పీడీ రవికుమార్ పర్యవేక్షణలో నిర్వహించారు.

కొడంగల్ వేంకటేశ్వరస్వామి

ఆలయ అభివృద్ధికి నిధులు

తిరుపతి తరహాలో మాఢవీధుల ఏర్పాటు

భూ సేకరణకు నోటిఫికేషన్ జారీ

కొడంగల్, జూలై 18(ఆంధ్రజ్యోతి): పేదల తిరుపతిగా పేరొందిన కొడంగల్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి మహర్దశ పట్టనుంది. ఆలయం మినీ తిరుపతిగా రూపుదిద్దుకోనుంది. గతంలో ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సీఎం హోదాలో ఆలయ అభివృద్ధిపై దృష్టి సారించారు. తిరుపతి తరహాలో మాడ విధులు, తదితర సౌకర్యాల కల్పనకు మాస్టర్ ప్లాన్ సిద్ధం చేశారు. ఆలయ అభివృద్ధికి రూ.100 కోట్లు మంజూరుతో అన్నీ విధాలుగా ఆలయాన్ని అభివృద్ధి చేయనున్నారు. ఆలయ అభివృద్ధికి పరిసరాల్లోని ఇళ్లు, ఖాళీ స్థలాలను సేకరించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. కలెక్టర్ ప్రతీక్‌జైన్ భూ సేకరణకు నోటిఫికేషన్ జారీ చేశారు. ఇందులో ఇళ్లు, స్థలాలు కోల్పోయే వారికి ఆలయ జాతర స్థలంలో నాలుగు ఎకరాల 34 గుంటల్లో ఇళ్ల స్థలాలను కేటాయించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు.

పక్కా ప్రణాళికతో అభివృద్ధి

తిరుమల తిరుపతి దేవస్థానానికి అనుసంధానంగా కొనసాగుతున్న కొడంగల్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం మినీ తిరుపతిగా రూపుదిద్దుకోనుంది. అందుకనుగుణంగా దేవాదాయ శాఖ అధికారులు మాస్టర్ ప్లాన్‌కు శ్రీకారం చుట్టారు. పురాతన ఆలయ స్థానంలో నిర్మాణ పనులు చేపట్టనున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో మాఢ వీధులు, జాతర ఉత్సవాలకు సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నారు. భక్తుల కోరిక మేరకు కొడంగల్‌లో 1870లో వెలిసిన వేంకటేశ్వరస్వామి ఆలయ ఉత్సవాలను ఏటా తిరుపతి తరహాలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రతీ ఏటా జాతర, పవిత్రోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతాయి. రూ.100 కోట్లతో మాడ వీధులు, గోశాల, కల్యాణ కట్ట, రాజగోపురం, అర్చన భవనం, విశాలమైన గదుల్లో వాహన సేవ, మండపం తదితర వాటిని నిర్మించనున్నారు.



వేంకటేశ్వరస్వామి మూల విరాట్

భూ సేకరణకు నోటిఫికేషన్ జారీ

ఆలయ అభివృద్ధికి సంబంధించి భూ సేకరణకు గురువారం కలెక్టర్ ప్రతీక్‌జైన్ నోటిఫికేషన్ జారీ చేశారు. ఆలయ నిర్మాణానికి నాలుగు ఎకరాలకు పైగా స్థలాన్ని సేకరించేందుకు మార్కింగ్ చేశారు. భూ సేకరణలో ఇళ్లు, ఖాళీ స్థలాలు కోల్పోతున్న వారికి ప్రభుత్వం తరపున ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఆలయానికి సంబంధించి జాతర స్థలంలో ఉన్న నాలుగు ఎకరాల 34 గుంటల భూమిలో బాధితులకు ఇళ్ల స్థలాలను కేటాయించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ప్రతీ ఒక్కరికీ 125 గజాల లేఅవుట్‌లో ఇంటి స్థలంతోపాటు నిర్మాణానికి కృషి చేయనున్నారు. నోటిఫికేషన్ విడుదల చేసిన తర్వాత తాండూర్ సబ్ కలెక్టర్ ఉమాశంకర్, తహసీల్దార్ విజయ్‌కుమార్, ఇతర అధికారులు, ఇళ్లు కోల్పోతున్న వారితో సమావేశం నిర్వహించారు.



ఆలయ అభివృద్ధిలో ఇళ్లు కోల్పోతున్న వారికి కేటాయించే ఇళ్ల స్థలాలు

ఆలయ అభివృద్ధికి సహకరించాలి



తిరుమల తిరుపతికి అనుసంధానంగా కొనసాగుతున్న కొడంగల్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి అందరూ సహకరించాలి. అభివృద్ధిలో భాగంగా ఇళ్లు, స్థలాలు కోల్పోతున్న వారిని ప్రభుత్వం ఆదుకుంటుంది.

- తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి

సీఎం కృషితో ఆలయ అభివృద్ధి



వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి కృషి హర్షనీయం. పేదల తిరుపతిగా కొనసాగుతున్న శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధిలో ఇళ్లు, స్థలాలు కోల్పోతున్న వారిని ప్రభుత్వం ఆదుకోవాలి.

- శ్రీనివాస్‌గుప్తా, ఆలయ ధర్మకర్త

మధ్యాహ్న భోజనంపై నిర్లక్ష్యం వద్దు

తాండూరు సబ్‌కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్

బషీరాబాద్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మధ్యాహ్న భోజన విషయంలో నిర్లక్ష్యంగా ఉండొద్దని ఉపాధ్యాయులు, ఏజెన్సీ నిర్వాహకులను తాండూరు సబ్‌కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్ ఆదేశించారు. శుక్రవారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల(బాలికలు)లో మధ్యాహ్న భోజనం అమలు తీరునూ పరిశీలించారు. స్టీల్ పాత్రల్లోనే భోజనం వండాలని ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. అంతకుముందు తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. తహసీల్దార్ షాహిదా బేగం, డిప్యూటీ తహసీల్దార్ రుక్సానబేగం, ఆర్‌ఐలు నాగార్జునరెడ్డి, సుధ, సిబ్బందితో సమావేశమయ్యారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తుల పరిష్కారంపై చర్చించారు. దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు.



రిజిస్టర్‌ను తనిఖీ చేస్తున్న సబ్‌కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్

ఘనంగా అమ్మకు బోనం

తాండూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని చివరి శుక్రవారం ఆలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు బోనాలతో వచ్చి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. తాండూరు పట్టణం నెహ్రూ గంజ్ (మార్కెట్ యార్డు) ఆవరణలోని రేణుకా నాగ ఎల్లమ్మను, మర్రి చెట్టు కూడలిలోని రక్తమైసమ్మను, వాల్మీకి నగర్ రేణుకా ఎల్లమ్మను శాకాంబరీగా అలంకరించారు. మహిళలు లలిత సహస్ర నామ పారాయణం చేశారు. సాయిపూర్‌లోని తాతా గుడి వద్ద అమ్మవారికి మహిళలు బోనం సమర్పించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, మాజీ వైస్ చైర్‌పర్సన్ దీపానర్సింహులు, మాజీ కౌన్సిలర్ నీరజ, నాయకులు బంటు మల్లప్ప, రాములు పాల్గొన్నారు.



బోనమెత్తిన తాండూరు మున్సిపల్ మాజీ వైస్ చైర్‌పర్సన్ దీపానర్సింహులు

సెల్ టవర్‌ను ఏర్పాటు చేయొద్దు

కీసర రూరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): సెల్ టవర్‌ను ఏర్పాటు చేయొద్దని కోరుతూ శుక్రవారం దమ్మాయిగూడ మున్సిపాలిటీ చీర్యాల్‌లోని ఈడెన్ గార్డెన్, సాయినగర్, స్వరూప్‌నగర్ కాలనీల ప్రజలు కలెక్టరేట్‌లో కలెక్టర్ మనూ చౌదరిని ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వృద్ధులు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రభావం చూపే సెల్ టవర్‌ను ఏర్పాటు చేయకుండా చూడాలని కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు. మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు సైతం సమస్యను వివరించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సాయికాలనీ అధ్యక్షుడు యాసిన్ షరీఫ్, ఈడెన్ గార్డెన్ అధ్యక్షుడు బాల్‌రెడ్డి, స్థానికులు లాజరస్, మనోహర్, పార్థసారధి, శ్రీనివాసరావు, రమేష్, సతీష్, జానిరెడ్డి, కమల్ కిషోర్, రామలింగేశ్వర్‌రావు, శ్రీశైలం, రామిరెడ్డి, కృష్ణరాజు పాల్గొన్నారు.



మేడ్చల్ కలెక్టర్ మనుచౌదరికి ఫిర్యాదు చేస్తున్న ప్రజలు

పేదల సంక్షేమానికే పథకాలు

కొడంగల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమానికే ప్రభుత్వం పథకాలు అమలు చేస్తుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక కడా కార్యాలయంలో కొడంగల్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రేషన్ లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డుల ప్రొసీడింగ్‌లను కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ విజయ్‌కుమార్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి సుదర్శన్, మార్కెట్ కమిటీ చైర్మన్ అంబయ్యగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ శివకుమార్‌గుప్త అందించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి మాట్లాడుతూ అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వం ఆహార భద్రత కల్పిస్తుందన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో రేషన్ లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్న ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎన్.ప్రశాంత్, నయీమ్, శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

500 గ్రాముల గంజాయి పట్టివేత

తాండూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): తాండూరు పట్టణం జనతా స్టోన్ ఫ్యాక్టరీ, కేటీసీ స్టోన్ ఇండస్ట్రీస్ పరిసరాల్లో ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించి 500 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. బిహార్‌కు చెందిన ముక్తార్ అలాం, నిజాం, సద్దామ్‌లు తాండూరు నాపరాతి పాలిషింగ్ మిషన్‌లలో లేబర్ పనికి వచ్చి జీవనం సాగిస్తున్నారు. బిహార్ నుంచి వచ్చేటప్పుడే గంజాయిని తీసుకు వచ్చి తాండూరులో విక్రయిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు వారి ఇళ్లలో తనిఖీలు చేపట్టి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వీరిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు తాండూరు ఆబ్కారీ శాఖ అధికారి కె.శ్రీనివాస్ తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్‌ఐలు నిజాముద్దీన్, రవికుమార్ సిబ్బంది పాల్గొన్నట్లు తెలిపారు.

సమయానికి బస్సులు నడపాలి



ధారూరు: బస్సుల కోసం ధర్నా చేస్తున్న విద్యార్థులు



కోట్‌పల్లి: ప్రధాన రోడ్డుపై బైఠాయించి ధర్నాచేస్తున్న విద్యార్థులు

ధారూరు, జూలై 18(ఆంధ్రజ్యోతి): బస్సు సమయానికి రావటం లేదని మండల పరిధిలోని తరిగోపు గ్రామంలో విద్యార్థులు, గ్రామస్తులు శుక్రవారం ధర్నా చేశారు. గ్రామం నుంచి వికారాబాద్‌కు ప్రతి రోజూ పాఠశాల, కళాశాలల విద్యార్థులు 100 మంది వరకు ప్రయాణిస్తుంటారు. బస్సు సమయపాలన పాటించకపోవటంతో సమయానికి పాఠశాలలు, కళాశాలలకు వెళ్లలేకపోతున్నామని వాపోయారు. ఉదయం 7.30, 8.30 గంటలకు, సాయంత్రం 5, 5.30 గంటలకు ఒక ట్రిప్పు చొప్పున వికారాబాద్ నుంచి బస్సు నడిపించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు బస్సు ముందు బైఠాయించడంతో డిపో మేనేజర్ మాట్లాడడంతో ధర్నాను విరమించారు.

కోట్‌పల్లి: మండల పరిధిలోని బార్వాద్ గ్రామంలోని ప్రధానరోడ్డుపై కళాశాలలు, పాఠశాలల విద్యార్థులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. నిత్యం వికారాబాద్ నుంచి బార్వాద్ వచ్చే బస్సు రెండురోజుల నుంచి రాకపోవడంతో బార్వాద్, మోత్కుపల్లి, నాసన్‌పల్లి, మద్దులపల్లి, కొంపల్లి, విద్యార్థులు కళాశాలకు వెళ్లలేకపోతున్నామని వాపోయారు. బార్వాద్ ప్రధానరోడ్డుపై దాదాపు గంట వరకు ధర్నా నిర్వహించారు. దీంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. ధర్నా విషయాన్ని కండక్టర్ వికారాబాద్ డిపో మేనేజర్ అరుణకు తెలపడంతో డ్రైవర్ లేక రెండు రోజులు ఇబ్బంది కలిగిందని తెలిపారు. ఇక నుంచి రోజూ సమయపాలన పాటిస్తూ బస్సు నడుస్తుందని హామీ ఇవ్వడంతో విద్యార్థులు ధర్నాను విరమించారు.

పేదలందరికీ ఇళ్లు మంజూరు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నేత కృష్ణ

మంచాల, జూలై 18(ఆంధ్రజ్యోతి): పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని టీడీపీ రాష్ట్ర నేత వంగాల కృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టీడీపీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొంగర వెంకట్‌రెడ్డి, పగడాల ఆనంద్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి సీహెచ్.చక్రపాణిలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. మంచాల మండల పరిధిలోని 23 గ్రామ పంచాయతీలకు చెందిన సుమారు మూడు వేల మంది ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రజాపాలన సదస్సుల్లో అర్జీలు పెట్టుకున్నారని చెప్పారు. కానీ, అధికార పార్టీకి చెందిన వారికే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నారని ఆరోపించారు. లింగంపల్లిగేటు వద్ద నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు పంపిణీకి నోచుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు ఇళ్లను పేదలకు పంచాలన్నారు. లేదంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

ఎంపీ డీకే అరుణకు సన్మానం

కేశంపేట, జూలై 18(ఆంధ్రజ్యోతి): ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కన్సల్టేటివ్ కమిటీ తెలంగాణ చైర్‌పర్సన్‌గా నియమితులైన మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణను కేశంపేట బీజేపీ నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఆమె నివాసంలో కలిసి శాలువతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. కేశంపేట మండల అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు పసుల నరసింహయాదవ్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు మహేష్, జిల్లా సంస్కృతిక శాఖ కోకన్వీనర్ కర్రెడ్ల నరేందర్ రెడ్డి, కల్వకోలు తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.



ఎంపీ డీకే అరుణను సన్మానిస్తున్న నాయకులు


కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎన్కేపల్లి రైతులు, బీజేపీ నాయకులు

ఎన్కేపల్లి రైతులకు న్యాయం చేయాలి

» కలెక్టర్‌ను కలిసిన రైతులు, బీజేపీ నాయకులు

మొయినాబాద్ రూరల్, జూలై 18(ఆంధ్రజ్యోతి): నగర శివారు ఎన్కేపల్లిలో కొన్నేళ్లుగా సాగు చేసుకుంటున్న పేదలకు ప్రభుత్వం న్యాయం చేయాలని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే రత్నం, చేవెళ్ల నియోజకవర్గ సీనియర్ నాయకుడు మల్లగారి డాక్టర్ వైభవ్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ఎన్కేపల్లి భూ బాధితుల కోసం శుక్రవారం రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్కేపల్లి భూ బాధితులకు బీజేపీ అండగా ఉంటుందని తెలిపారు. చర్చగా మారిన గోశాలను మరో ప్రాంతానికి తరలించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో అనేక ప్రభుత్వ స్థలాలు ఉన్నా, ఇక్కడే ఏర్పాటు చేయడం సరికాదన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో రైతులు ఈశ్వర్, సికిందర్, నాయకులు కంజర్ల ప్రకాష్, మోర నర్సింహారెడ్డి, శ్రీనివాస్ గౌడ్, తదితరులు ఉన్నారు.


కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

బ్రిడ్జి నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలి

» కలెక్టర్‌కు చర్లగూడ గ్రామస్తుల వినతి

షాబాద్, జూలై 18(ఆంధ్రజ్యోతి): అసంపూర్తిగా ఉన్న చర్లగూడ గ్రామ బ్రిడ్జిని త్వరగా పూర్తి చేయాలని మాల సంక్షేమ సంఘం నాయకులు గ్రామస్తులతో కలిసి శుక్రవారం కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిప్రతం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు చొక్కంపేట అంజనేయులు మాట్లాడుతూ.. షాబాద్ మండల పరిధిలోని చర్లగూడ గ్రామానికి వెళ్లే బ్రిడ్జి పనులు అసంపూర్తిగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. బ్రిడ్జితోపాటు గ్రామానికి వెళ్లే బీటీ రోడ్డు నిర్మాణ పనులు మూడేళ్లుగా కొనసాగుతున్నాయని, దీంతో వర్షాకాలంలో నీరు నిలిచి రావాణాకు ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. దీనిపై గతంలో చేవెళ్ల ఆర్డీవోకు ఫిర్యాదు చేశామని తెలిపారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి బ్రిడ్జి, రోడ్డు నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్, మల్లేష్, అంజయ్య, సత్యనారాయణ, కృష్ణ, రాజు, శేఖర్ పాల్గొన్నారు.


మహిళా సంఘాలకు చెక్కు అందిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి

మహిళల అభ్యున్నతికి కృషి

కొడంగల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి అన్నారు. ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో భాగంగా శుక్రవారం స్థానిక కడా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే సీఎం రేవంత్‌రెడ్డి లక్ష్యం అన్నారు. అనంతరం కొడంగల్ నియోజకవర్గంలోని 3,206 స్వయం సహాయక సంఘాలకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ.8 కోట్ల 58 లక్షల చెక్కును అధికారులతో కలిసి అందించారు. ఈ కార్యక్రమంలో కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, డీఆర్‌డీవో శ్రీనివాస్, పీఏసీఎస్, మార్కెట్ కమిటీ చైర్మన్లు శివకుమార్‌గుప్తా, అంబయ్యగౌడ్, ఏపీఎం వెంకన్న, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రశాంత్, మండల మహిళా సమాఖ్య అధ్యక్షులు పాల్గొన్నారు.


ప్రణీత్‌కు పీహెచ్‌డీ అందజేస్తున్న పురుషోత్తంరెడ్డి

విద్యతోపాటు పరిశోధనలు ముఖ్యం

మొయినాబాద్ రూరల్, జూలై 18(ఆంధ్రజ్యోతి): విద్యతోపాటు పరిశోధనలు సమాజానికి ఎంతో ముఖ్యమని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ చైర్మన్ డాక్టర్ పురుషోత్తంరెడ్డి, డెరెక్టర్ అండ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సాత్విక రెడ్డి అన్నారు. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని హిమాయత్‌నగర్‌లోని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ ఫార్మసీ విభాగంలో సత్యనారాయణ 'ప్రిపరేషన్ అండ్ క్యారెక్టరైజేషన్ ఆఫ్ టాపికల్ నియోసోమల్ జెల్ ఫర్ ఆసిన్ ట్రీట్మెంట్' అనే అంశంపై డాక్టర్ సరతా చుక్క పర్యవేక్షణలో పరిశోధన చేశారు. ఇందుకు గాను సత్యనారాయణకు యూనివర్సిటీ చైర్మన్ డాక్టర్ సీహెచ్.పుషోత్తం రెడ్డి, సాత్వికరెడ్డి శుక్రవారం యూనివర్సిటీలో పీహెచ్‌డీ ప్రదానం చేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రవీందర్, డీన్ ఆచార్య క్రిస్టోఫర్, రాజేందర్‌రెడ్డి, శంకరయ్య, జగదీష్, కుమారస్వామి, డానియల్, డాక్టర్ సరిత, అసిస్టెంట్ రిజిస్ట్రార్ అండ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ గాదె రాంబాబు తదితరులు పాల్గొన్నారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కామ్రేడ్ విజయలక్ష్మి బంధువులు

'ప్రజలదే విజయం' పుస్తకావిష్కరణ

కేశంపేట, జూలై 18(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ కగార్‌లో భాగంగా ఛత్తీసగఢ్‌లో మృతి చెందిన కేశంపేట మండలం వేమలనర్వ గ్రామానికి చెందిన మావోయిస్టు విజయలక్ష్మీ అలియాస్ భూమికపై రచించిన 'ప్రజలదే విజయం' పుస్తకాన్ని ఆవిష్కరించారు. అమరులు బంధుమిత్రుల సంఘం(ఏబీఐఎంఎస్) ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మావోయిస్టు విజయలక్ష్మీపై రాసిన 'ప్రజలదే విజయం'.. కామ్రేడ్ 'విజయలక్ష్మి అలియస్ భూమిక కథలు' అనే ఉపశీర్షికతో పుస్తకాన్ని విడుదల చేశారు. ఉద్యమంలో విజయలక్ష్మి పోషించిన పాత్రపై పుస్తకంలో వివరించినట్లు తెలిపారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో విజయలక్ష్మి తండ్రి సాయిల్‌గౌడ్, బంధువులు ప్రేమ్‌కుమార్ గౌడ్, కృష్ణవేణి, సునీత, రాజేందర్‌గౌడ్, అనీల్ పాల్గొన్నారు.

ఔటర్‌పై మృత్యుఘోష


బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎంపీ మాలోత్ కవిత

(మూడో పేజీ తరువాయి)

భార్య, ముగ్గురు ఆడ పిల్లలున్నారు. బాల్‌రాజ్ చికెన్ సెంటరు నడుపుతూనే మత్స్యకార సంఘంలో చురుకైన పాత్ర పోషిస్తున్నాడు. కాగా వీరైదుగురు బాల్‌రాజ్ కారులో వెళ్లి ఒక్కసారిగా విగతజీవులుగా మారడంతో ఆ కుటుంబాల్లో తీవ్ర విషాదం నింపింది. కుటుంబ పెద్దను కోల్పోవడంతో మాకు దిక్కెవరంటూ కుటుంబ సభ్యులు బోరున విలపించడంతో ఆస్పత్రిలో ఉన్న వారిని తీవ్రంగా కలిచివేసింది. కాగా మృతుల కుటుంబాలను మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి, మాజీ ఎంపీ మాలోత్ కవితలు పరామర్శించి ఓదార్చారు. మృతదేహాలను పోస్టుమార్టం అనంతరం స్వగ్రామాలకు తరలించారు.

అతివేగంతోనే ప్రాణాల మీదకు..

ఔటర్ రింగు రోడ్డుపై ఆరు నెలల కాలం వ్యవధిలో జరిగిన ఘటనలు చూస్తే అతివేగంతోనే ప్రమాదాలు జరిగి ఆ కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. ఈ ఏడాది మార్చి 6న ఓఆర్ఆర్ ఎగ్జిట్ 13 సమీపంలో వాటర్ ట్యాకంర్‌ను ఓ బ్రీజా కారు అతి వేగంతో ఢీ కొట్టడంతో మొక్కలకు నీరు పడుతున్న ఓ కూలీతో పాటు కారు నడుపుతున్న వ్యక్తితోపాటు కారులో ఉన్న మరొకరు కూడా మరణించారు. మరో ఘటనలో ఓఆర్ఆర్ ఎగ్జిట్ 12 బొంగులూరు వద్ద రోడ్డు పక్కన ఉన్న క్రాష్ బ్యారియర్‌ను ఓ కారు అతివేగంతో ఢీ కొట్టడంతో బెంగాల్‌కు చెందిన కాంట్రాక్టరు ఒకరు అక్కడిక్కడే మృతి చెందారు. మరో ఘటనలో యాచారం మండలం నల్లవెల్లికి చెందిన వ్యక్తి గచ్చిబౌలి నుండి బొంగులూరు వైపు కారులో వస్తూ అతివేగంతో డివైడర్‌ను ఢీ కొట్టి తీవ్రంగా గాయపడ్డ అతను అక్కడిక్కడే మృతి చెందాడు. హయత్‌నగర్ పరిధి కుంట్లూరు సమీపంలో తెల్లవారుజామున ఆగి ఉన్న డీసీఎంను ఓ కారు అతివేగంతో ఢీ కొట్టడంతో ఒకే కుటుంబానికి చెందిన అన్నదమ్ముల కొడుకులు అక్కడిక్కడే మృత్యువాతపడ్డారు. దీంతో ఇరు కుటుంబాలు తనయులను కోల్పోవడం అందరినీ కలిచివేసింది. తాజాగా గురువారం రాత్రి పొద్దుపోయిన తర్వాత ఓఆర్ఆర్‌పై బొంగులూరు వద్ద ముందు వెళ్తున్న లారీని బెలెనో కారు వెనక నుండి అతివేగంతో ఢీ కొట్టడంతో ఒకేసారి ఐదుగురు మృతి చెందారు. అతివేగంతోపాటు మద్యం సేవించి వాహనాలు నడపడంకూడా ప్రమాదాలకు కారణమవుతూ ప్రాణాల మీదకు తెస్తున్నాయి.


ఘట్‌కేసర్‌లో కురుస్తున్న వర్షం


ధారూరు: నాగసమందర్‌లో ఓ ఇంటి ముందు నిలిచిన వరద నీరు

కరుణించిన వరుణుడు

(మూడో పేజీ తరువాయి)

పడుతుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షాలతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. నగర శివార్లలోని పలు కాలనీల్లోని ఇళ్లల్లోకి నీరు చేరింది. మరో వైపు భారీ వర్షాల కారణంగా పల్లెల్లో మట్టి రోడ్లు దెబ్బతిన్నాయి. చేవెళ్ల పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ఎస్సీ బాలుర వసతి గృహ ప్రాంగణంలో వర్షం నీరు భారీగా చేరడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఇదిలా ఉంటే ఉమ్మడి జిల్లాలో మరో రెండు రోజుల పాటు వర్షాలు పడే అవకాశాలు ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది.


మొయినాబాద్: నాగిరెడ్డిగూడ - ఎన్కేపల్లి గ్రామాల మధ్య రోడ్డుపై కూలిన ప్రహరీ

మేడ్చల్ జిల్లాలో..

మేడ్చల్ జిల్లా బాలానగర్ మండలం బోయినపల్లిలో అత్యధికంగా 114.5 మి.మీ వర్షం పడగా ఉప్పల్‌లో 101మి.మీ, మల్కాజిగిరిలో 97.8 మి.మీ, కుత్బుల్లాపూర్‌లో 87.3 మి.మీ, దుండిగల్‌లో 86 మి.మీ, ఆల్వాల్‌లో 76మి.మీ, బాచుపల్లిలో 72.5మి.మీ, కూకట్‌పల్లిలో 72మి.మీ వర్షం కురిసింది.

వికారాబాద్‌లో భారీ నుంచి మోస్తరు..

వికారాబాద్ జిల్లా కేంద్రంతో పాటు నవాబ్‌పేట, తాండూరు, ధారూరు, పెద్దేముల్, మోమిన్‌పేట, మర్పల్లి, బషీరాబాద్, పూడూరు, కోట్‌పల్లి మండలాల్లో శుక్రవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు భారీ వర్షం కురిసింది. యాలాల్, పరిగి, బొంరాస్‌పేట్ తదితర మండలాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. కురిసిన వర్షానికి రోడ్లపై వర్షం నీరు వరదలా ప్రవహించింది. వికారాబాద్‌లోని రైతు బజార్‌లోకి భారీగా వర్షం నీరు చేరడంతో జలమయమైంది. దీంతో కూరగాయలు విక్రయించే రైతులు, వ్యాపారులు ఎప్పటిలాగే తీవ్ర ఇబ్బందుల పాలయ్యారు. రాత్రి 8 గంటల వరకు జిల్లాలో అత్యధికంగా నవాబ్‌పేట్‌లో 89.0 మి.మీ. వర్షం కురిసింది. తాండూరులో 67.0 మి.మీ., ధారూరులో 40.8 మి.మీ., వికారాబాద్‌లో 39.5 మి.మీ., పెద్దేముల్‌లో 31.0 మి.మీ., మోమిన్‌పేట్‌లో 29.8 మి.మీ. వర్షం కురిసింది.


చేవెళ్ల: ఆలూర్ గ్రామానికి వెళ్లే రోడ్డు ఇలా..

21న ఆమనగల్లుకు మంద కృష్ణ మాదిగ రాక

ఆమనగల్లు, జూలై 18(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీకనుగుణంగా దివ్యాంగులకు రూ.6వేలు, చేయూత పింఛన్లు రూ.4 వేలు, కండరాల క్షీణతల దివ్యాంగులకు రూ.15 వేల పింఛన్లు అందజేయాలని వికలాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు జంగయ్య డిమాండ్ చేశారు. ఇప్పటికే దరఖాస్తులు చేసుకున్న వారికి పింఛన్లు మంజూరు చేయాలని కోరారు. ఈనెల 21న ఆమనగల్లులో శ్రీ లక్ష్మీ గార్డెన్‌లో నిర్వహించే దివ్యాంగుల సభకు సంబంధించి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ హాజరయ్యే సభను విజయవంతం చేయాలని నాయకులు కోరారు. అనంతరం ఆమనగల్లు పట్టణంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో జంగయ్య మాట్లాడుతూ దివ్యాంగులకు రాజకీయ రంగాలలో కూడా తగిన అవకాశం కల్పించాలన్నారు. సభకు పెద్దసంఖ్యలో దివ్యాంగులు, చేయూత పింఛన్‌దారులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలన్నారు. వీహెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటేశ్, నాగార్జున, శ్రీనివాసాచారి, వికలాంగుల ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకుడు నర్సింహగౌడ్, వీహెచ్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహ్మద్ సలీం, వికలాంగుల సంఘం మండలాధ్యక్షుడు భాస్కర్ ఉన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేయించుకోవాలి

ఆమనగల్లు, జూలై 18(ఆంధ్రజ్యోతి): రైతులు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలని ఆమనగల్లు ఏడీఏ శోభారాణి సూచించారు. రైతుల వివరాల నమోదులో తప్పులకు తావివ్వకూడదని తెలిపారు. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని జంగారెడ్డిపల్లి గ్రామంలో శుక్రవారం ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమం నిర్వహించారు. ఏవో శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి ఏడీఏ శోభారాణి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో గాయత్రి, రైతులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే పేదలకు మేలు

» ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు, జూలై 18(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌తోనే పేదలకు మేలు జరుగుతుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆమనగల్లు, కడ్తాల మండలాల్లో శుక్రవారం పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పలు చోట్ల ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించి పనుల్లో వేగం పెంచాలని సూచించారు. లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. పేదలు ఆర్థికంగా రాణించాలన్నదే సీఎం రేవంత్ రెడ్డి ధ్యేయమన్నారు. పదేళ్ల పాలనలో బీఆర్‌ఎస్ పేదలకు ఒక్క ఇళ్లు కూడా ఇవ్వలేదని ఆరోపించారు. ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం అవుతుందన్నారు. ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో కల్వకుర్తి నియోజకవర్గం పరిధిలో రూ.600 కోట్లతో రోడ్లను ఆధునీకరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు, కాంగ్రెస్ జిల్లా నాయకుడు సూదిని కొండల్‌రెడ్డి, కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు ఇటికాల విజయమ్మ, నాయకులు యాదయ్యగౌడ్, తాళ్ల రవీందర్, సంపత్, రామకృష్ణ, బాబా, దశరథ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

నేర సంస్కృతిని అణిచివేయాలి

షాద్‌నగర్ అర్బన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో నెలకొంటున్న నేర సంస్కృతిని ఆదిలోనే అణిచివేయడానికి పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి కోరారు. ఫరూఖ్‌నగర్ మండలంలోని చిల్కమర్రి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు రవీందర్‌రెడ్డిపై అదే గ్రామానికి చెందిన శివకృష్ణారెడ్డి దాడి చేసి బ్లేడ్‌తో తలకోసిన విషయం తెలిసిందే. తీవ్ర రక్తస్రావానికి గురైన రవీందర్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి, చికిత్స అందిస్తున్నారు. ఈ మేరకు శుక్రవారం చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి ఆసుపత్రికి వెళ్లి, రవీందర్‌రెడ్డిని పరామర్శించారు. హత్యాయత్నంపై సమగ్ర విచారణ చేసి, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మధురాపురం మాజీ సర్పంచ్ శివశంకర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు హరీశ్వర్‌రెడ్డి, వెంకటేష్‌గౌడ్, శివకుమార్‌రెడ్డి ఉన్నారు.


రవీందర్‌రెడ్డిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి

ఆ నలుగురికి దారేది?

మర్పల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): వానాకాలంలో ఎవరైనా మృతి చెందితే శ్మశానవాటికకు తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహించాలంటే అరచేతిలో ప్రాణాలు పెట్టుకొని వెళ్లాల్సిందేనని మర్పల్లి మండలంలోని సిరపురం గ్రామస్తులు వాపోయారు. శుక్రవారం సిరిపూరం గ్రామానికి చెందిన చాకలి నాగయ్య మృతి చెందాడు. అంత్యక్రియల నిమిత్తం తీసుకెళ్తుండగా ఒక్కసారిగా వర్షం కురిసి ఈరన్న వాగు పొంగిపొర్లడంతో అతి కష్టం మీద వాగు దాటి శ్మశానవాటికకు వెళ్లాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. శ్మశానవాటికకు వెళ్లే దారిలో వంతెన నిర్మించాలని పలు మార్లు అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోయిందని వాపోయారు. ఇప్పటికైనా సమస్యను గుర్తించి వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు.


శ్మశానవాటికకు వెళ్లేందుకు వాగు దాటుతున్న సిరిపురం గ్రామస్తులు

అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తాం

» చేవెళ్ల మున్సిపల్ కమిషనర్ వెంకటేశం

చేవెళ్ల, జూలై 18 (ఆంధ్రజ్యోతి): చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టాలన్నా మున్సిపల్ అధికారుల అనుమతులు తీసుకోవాలని చేవెళ్ల మున్సిపాల్ కమిషనర్ వెంకటేశం అన్నారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ.. కొత్తగా ఏర్పడిన చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని 12 గ్రామాల్లో కొత్తగా ఎలాంటి నిర్మాణాలు చేపట్టాలన్నా మున్సిపల్ అధికారులు అనుమతులు తీసుకోవాలని సూచిస్తున్నారు. చేవెళ్ల పట్టణ కేంద్రంలోని కమలనగర్, టీచర్స్ కాలనీలతోపాటు మరికొన్ని కాలనీల్లో పర్యటించారు. ఇండ్లు నిర్మించుకున్న వారిలో చాలా మంది ప్రభుత్వ ఉద్యోగులు, వ్యాపారులు ఉండడం శోచనీయమన్నారు. అనుమతి లేని ఇండ్లకు మున్సిపాల్ నుంచి అనుమతులు తీసుకోవాలన్నారు. లేనిచో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పట్టణ కేంద్రంలో వ్యాపారులు తప్పనిసరిగా లైసెన్స్‌లు తీసుకోవాలన్నారు. మున్సిపల్ అభివృద్ధికి పట్టణ ప్రజలు, ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు.



భక్తిశ్రద్ధలతో బోనాల ఉత్సవాలు


షాద్‌నగర్ శ్రీనగర్ కాలనీలో మైసమ్మ బోనాలు

చౌదరిగూడ/షాద్‌నగర్, జూలై 18(ఆంధ్రజ్యోతి): కొందుర్గు మండలం టేకులపల్లి, తంగేళ్లపల్లి, లాలాపేట్, చిన్న ఉమ్మెంత్యాల, జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలోని తుమ్మలపల్లి, లచ్చంపేట్, వనంపల్లి, ఇంద్రనగర్, కాస్లాబాద్, రావిర్యాల, గుంజల్‌పహాడ్, జాకారం తదితర గ్రామాల్లో శుక్రవారం పోచమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా మహిళలు బోనాలతో పోచమ్మ ఆలయాలకు తరలివెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. బోనాల ఊరేగింపులో పోతరాజుల విన్యాసాలు, డప్పు వాయిద్యాలు, యువకుల కేరింతలు ఆకట్టుకున్నాయి. అలాగే షాద్‌నగర్ పట్టణంలో భక్తిశ్రద్ధలతో మైసమ్మ బోనాలను నిర్వహించారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి ఆలయాల్లో అమ్మవార్లకు నైవేద్యం సమర్పించారు. షాద్‌నగర్ పట్టణంలోని శ్రీనగర్‌కాలనీలో ఉన్న బంగారు మైసమ్మకు, రైతు కాలనీలోని కోట మైసమ్మకు బోనాలను సమర్పించి, మొక్కుబడులను తీర్చుకున్నారు.


చౌదరిగూడ: తుమ్మలపల్లిలో బోనాలతో మహిళలు

మోస్తరు నుంచి భారీ వర్షం



యాచారంలో కురుస్తున్న వర్షం

- కూలిన ప్రహరీలు, నేలకొరిగిన వృక్షాలు
- ఇబ్బందులుపడ్డ వాహనదారులు.. ట్రాఫిక్ జామ్



షాబాద్ : గుంతల్లో నీరుచేరి బురదమయంగా మారిన మీరాపూర్ రోడ్డు



కొంగరకలాన్‌లో కలెక్టరేట్ వద్ద కురుస్తున్న వర్షం

ఆదిభట్ల/మొయినాబాద్/చౌదరిగూడ/షాద్‌నగర్ అర్బన్/చేవెళ్ల/యాచారం/ఆమనగల్లు/మాడ్గుల, జూలై 18(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా శుక్రవారం మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఆదిభట్ల మున్సిపాలిటీ పరిధిలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కొంగరకలాన్‌లో పలు ఇళ్లలోకి వర్షపు నీరు చేరడంతో సామగ్రి మునిగిపోయింది. దాతర్ చెరువులోకి వరద నీరు రావడంతో కొంగరకలాన్-ఎలిమినేడు, తిమ్మాపూర్ గ్రామాలకు వెళ్లే వాహనదారులకు కొద్దిసేపు అంతరాయం ఏర్పడింది. మొయినాబాద్ మున్సిపాలిటీతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో రోడ్లపైకి భారీగా నీరు చేరింది. వ్యవసాయ పొలాల వద్ద ప్రహరీలు కూలిపోయాయి. విద్యుత్ స్తంభాలు విరిగిపోయి కరెంటు సరఫరాకు అంతరాయం కలిగింది. చెట్లు నేలకు ఒరిగాయి. మొయినాబాద్ పీఎస్ వద్ద ప్రహరీ కూలిపోయింది. చెట్టు నేలకు ఒరిగింది. ఎన్కెపల్లి, చిన్నమంగళారం, అజీజ్‌నగర్, అమడాపూర్, సురంగల్ తదితర గ్రామాల్లో ప్రహరీలు కూలాయి. కనకమామిడి సమీపంలో హైదరాబాద్ బీజాపూర్ హైవేపై భారీగా వర్షపు నీరు చేరి వాహనాల రాకపోకలు ఇబ్బంది ఏర్పడింది. శుక్రవారం రాత్రి వరకు వర్షం కురిసింది. బాకారం, నాగిరెడ్డిగూడ, అమడాపూర్ గ్రామాల్లో నీట మునిగిన పంటలను మండల వ్యవసాయ విస్తరణ అధికారి పరిశీలించారు. కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాల్లో గురువారం రాత్రి భారీ వర్షం కురిసింది. షాద్‌నగర్ డివిజన్ పరిధిలో గురువారం కురిసిన వర్షం వానకాలం పంటలకు జీవం పోసినట్టయింది. గురువారం రాత్రి డివిజన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో వర్షం కురిసింది. షాద్‌నగర్ పట్టణంలో సైతం భారీ వర్షం కురిసి, లోతట్టు ఇండ్లలోకి వరద నీరు వచ్చింది. చేవెళ్ల మండల పరిధిలోని ఆలూర్ గ్రామానికి వెళ్లే ప్రధాన రోడ్డు వర్షానికి గుంతలమయమైంది. గ్రామస్తులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉన్నతాధికారులు స్పందించి రోడ్డును బాగుచేయాలని ఆలూర్ గ్రామస్తులు కోరారు. యాచారం మండలం నందివనపర్తి, చౌదర్‌పల్లి, చిన్నతూండ్ల, నజ్దిక్‌సింగారం, మాల్ తదితర గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. దాంతో పంటలకు జీవం పోసినట్లయిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆమనగల్లు మండలంలోని పలు గ్రామాలలో గురువారం రాత్రి భారీ వర్షం కురిసింది. దాంతో మొక్కజొన్న, పత్తి పంటలు కళకళలాడుతున్నాయి. అలాగే మాడ్గుల మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం రాత్రి భారీ వర్షం కురిసింది. దాంతో ఇళ్లలోకి నీరు చేరింది. నల్లచెర్వు, సుద్దపల్లి, బ్రాహ్మణపల్లి చెరువుల్లో కొంతమేర నీరు చేరింది.



ఆమనగల్లు : కళకళలాడుతున్న మొక్కజొన్న పంట



మొయినాబాద్: మొయినాబాద్ పీఎస్ వద్ద కూలిన ప్రహరీ, నేలకొరిగిన వృక్షం

క్రైం కార్నర్

కల్లు దుకాణంపై ఎక్సైజ్ అధికారుల దాడి

- 156 లీటర్ల కల్తీ కల్లు పారబోత

హైదరాబాద్ సిటీ, జూలై 18(ఆంధ్రజ్యోతి): కొత్తూరు మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న కల్లు దుకాణంపై శుక్రవారం ఎక్సైజ్ అధికారులు దాడి చేశారు. అనుమతులు లేకుండా కల్లు దుకాణం నిర్వహిస్తున్న సత్తయ్యను అరెస్ట్ చేశారు. అక్కడ అమ్మకానికి సిద్ధంగా ఉంచిన 156 లీటర్ల కల్తీ కల్లును పారబోశారు.

దంపతుల గొడవ.. ఇంటి నుంచి వెళ్లిపోయిన భర్త

చేవెళ్ల, జూలై 18(ఆంధ్రజ్యోతి): భార్యాభర్తలు గొడవపడటంతో భర్త ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లిపోయిన ఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని దామరిగిద్దలో చోటుచేసుకుంది. ఎస్సై సంతోష్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చేవెళ్ల మున్సినపాలిటీ పరిధిలోని దామరిగిద్ద గ్రామానికి చెందిన బేగరి నర్సింలు, అతని భార్య శాంతమ్మలు కొంతకాలంగా తరచూ గొడవపడుతూ ఉండేవారు. ఈక్రమంలో ఈనెల 17న రాత్రి మళ్లీ భార్యభర్తలు గొడవపడ్డారు. దాంతో నర్సింలు ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు తప్పిపోయిన నర్సింలు భార్య శాంతమ్మ, చేవెళ్లకు చెందిన ధార ప్రదీప్‌లపై అనుమానం ఉందని ఆరోపించారు. ఈ విషయంలో పోలీస్‌లు విచారణ జరిపి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని, తప్పిపోయిన వ్యక్తి సోదరి ఏర్పుల అనంత చేవెళ్ల పోలీస్‌లకు శుక్రవారం ఫిర్యాదు చేసింది. ఈమేరకు పోలీస్‌లు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలి



కళాశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

మహేశ్వరం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మానవ మనుగడకు చెట్లు ఎంతో దోహదపడుతాయని, విద్యార్థులు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన వన మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులు, అధ్యాపకులతో కలిసి మొక్కలు నాటారు. కళాశాల తరగతి గదులను పరిశీలించి ఏమైనా సమస్యలు ఉన్నాయా? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రిన్సిపాల్ రమేష్, వైస్‌ప్రిన్సిపాల్ చందన, ఇంతియాజుద్దీన్, జహేదాబేగం తదితరులున్నారు.

అధైర్య పడకండి అండగా ఉంటా



రమేష్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శంకర్

నందిగామ, జూలై 18(ఆంధ్ర జ్యోతి): అధైర్య పడకండి అండగా ఉంటానని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మండలంలోని వీర్లపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు రమేష్ కుటుంబానికి భరోసా ఇచ్చారు. గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు చాకలి రమేష్ అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. సమాచారం అందుకున్న షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్ గ్రామానికి వెళ్లి రమేష్ మృతదేహానికి పూలమాలలువేసి నివాళు లర్పించారు. అధైర్యపడవద్దు అండగా ఉంటామని రమేష్ కుటుంబ సభ్యు లకు ధైర్యంచెప్పి అంత్యక్రియలకోసం ఆర్థికసాయం అందజేశారు. చంద్ర శేఖర్, చిందం నర్సింలు, సీతారాములు, మల్లేష్, అన్వర్ తదితరులున్నారు.

సీఎం సభకు తరలిన కాంగ్రెస్ నాయకులు



ర్యాలీని ప్రారంభిస్తున్న గూడూరు శ్రీనివాస్ రెడ్డి

కడ్తాల్, జూలై 18(ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌లో శుక్రవారం నిర్వహించే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ సభకు కడ్తాల మండల కేంద్రం నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. వాహనాల కాన్వాయ్‌తో కొల్లాపూర్‌కు నాయకులు తరలివెళ్లారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో వివిధ గ్రామాల నుంచి సభకు జనసమీకరణ చేశారు. గ్రామాల నుంచి వచ్చిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యనాయక్, డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యనాయక్, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, గిరిజనసేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మనాయక్ లతోకలిసి డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటేశ్, ఏఎంసీ డైరెక్టర్ నరేశ్ నాయక్, రాంచందర్‌నాయక్, ఇమ్రాన్‌బాబా, మంకి శ్రీను,బాలరాజ్, రమేశ్, మహేశ్, ఖాదర్, తదితరులు ఉన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలి

చేవెళ్ల, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని పీడీఎస్‌యూ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజేశ్ డిమాండ్ చేశారు. శుక్రవారం చేవెళ్ల పట్టణ కేంద్రంలో పీడీఎస్‌యూ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగంపై నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. ఎంఈవో, ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలన్నారు.

మహిళల సంక్షేమానికి పెద్దపీట

ఆమనగల్లు, జూలై 18(ఆంధ్రజ్యోతి): మహిళల సంక్షేమం, ఆర్థికాభివృద్ధి, రక్షణకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఆమనగల్లు వ్యవసాయం మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ యాట గీతానర్సింహ అన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్నదే సీఎం రేవంత్‌రెడ్డి ధ్యేయమన్నారు. ఆమనగల్లు మార్కెట్ యార్డ్‌లో శుక్రవారం విలేఖరుల సమావేశంలో గీత మాట్లాడుతూ ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల మండలాల పరిధిలోని 2378 మహిళాల సంఘాలకు రూ.2,29,62,948 కోట్ల వడ్డీలేని రుణాలు మంజూరైనట్లు తెలిపారు. ఆమనగల్లు పట్టణంలోని శ్రీలక్ష్మీ గార్డెన్‌లో నేడు(శనివారం) ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, ఎంపీ మల్లు రవిలు చెక్కుల పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

ఆమనగల్లు, జూలై 18(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని సంకటోనిపల్లికి చెందిన వసంత భవనేశ్‌కు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.48 వేలు మంజూరయ్యాయి. శుక్రవారం బాధిత కుటుంబానికి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ తాళ్ల రవీందర్ చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో గంగిశెట్టి శేఖర్, కమటం శివ, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రికి భాస్కర్‌గౌడ్ శుభాకాంక్షలు



అశ్వినీ వైష్ణవ్‌ను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలుపుతున్న భాస్కర్‌గౌడ్

మహేశ్వరం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కాటం భాస్కర్ గౌడ్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వివిధ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు హైదరాబాదుకు వచ్చిన కేంద్ర మంత్రిని శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కలిసి శాలువాతో సత్కరించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపినట్లు భాస్కర్‌గౌడ్ పేర్కొన్నారు. కాగా, ఆయన అంతకుముందు ఎయిర్‌పోర్టులో ఆయనకు ఘన స్వాగతం పలికారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

యాచారం, జూలై 18(ఆంధ్రజ్యోతి): త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని, ఎంపీపీ, జెడ్పీటీసీ స్థానాలు ఎక్కువ సంఖ్యలో గెలుపొందాలని, అందుకోసం నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు మస్కు నర్సింహ, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎండీ అక్బర్‌లు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని చెప్పారు. ధరణితో భూములను పేదలకు దక్కకుండా చేసిన బీఆర్‌ఎస్ కుట్రలను కాంగ్రెస్ ప్రభుత్వం భూభారతి పోర్టల్‌తో తగిన న్యాయం చేసేందుకు కృషి చేస్తోందని అన్నారు. విపక్షాలు ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తే తక్షణమే ఖండించాలన్నారు. నియోజకవర్గ ప్రగతికోసం స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఎంతో శ్రమిస్తున్నారని అన్నారు. మండల నాయకులు వరికుప్పల తిరుమలేష్, గడల మల్లేష్, లిక్కి కుమార్, వి.సుధాకర్ తదితరులున్నారు.

కెమెరాల ఏర్పాటుకు ఆర్థికసాయం

తలకొండపల్లి, జూలై 18(ఆంధ్రజ్యోతి): నేర పరిశోధనకు సీసీ కెమెరాలు ఎంతగానో దోహద పడుతాయని ఎస్సై శ్రీకాంత్ అన్నారు. గట్టిప్పలపల్లిలో సీసీ కెమెరాల ఏర్పాటుకు గ్రామ నాయకులు శెట్టి ఎల్లయ్య రూ.50వేలు, సూరిశెట్టి సురేశ్ రూ.11వేలు, వీరబ్రహ్మం శ్రీనివాస్ రూ.10వేలు శుక్రవారం స్థానిక నాయకులతో కలిసి ఎస్సై శ్రీకాంత్‌కు అందజేశారు. వారిని పోలీసులు అభినందించారు. మొకురాల అశోక్‌గౌడ్, చంద్రశేఖర్, దుబ్బ విజయ్, నవీన్, తదితరులు ఉన్నారు.

క్లాస్‌మేట్ కుటుంబానికి చేయూత

మాడుల్గ, జూలై 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన దుబ్బ రవికాంత్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న అతడి టెన్త్ క్లాస్‌మేట్స్ తలా కొంత డబ్బు పోగు చేశారు. శుక్రవారం రవికాంత్ కుటుంబాన్ని పరామర్శించి రూ.90వేల ఆర్థిక సాయం అందజేశారు. వెంకటేష్, మహేష్, రాజేష్, రమేష్, చంద్రశేఖర్, శ్రీకాంత్, పాల్గొన్నారు.

పకడ్బందీగా పథకాలు అమలు చేయాలి

(మూడో పేజీ తరువాయి)



దిశ సమావేశంలో వివిధ శాఖల అధికారులు

జమ కావడం లేదని దిశ సభ్యుడు ఎంపీ దృష్టికి తీసుకువచ్చారు. అదేవిధంగా జిల్లాలో కూరగాయ పంటలు, పామాయిల్ సాగు చేస్తున్న రైతులందరికీ డ్రిప్పు అందించాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య కోరారు.

చిన్నారులకు పౌష్టికాహారం అందివ్వాలి

అంగన్వాడీలు, పాఠశాలల్లో పోషక విలువలు కలిగిన ఆహారం అందించాలని, గుడ్డుతో పాటు సోయామిల్క్ అందించేలా చర్యలు తీసుకోవాలని డీఈవో సుశీంద్రరావుకు ఎంపీ సూచించారు. పదో తరగతిలో 87శాతం ఉత్తీర్ణత సాధించడంపై డీఈవోను అభినందించారు. చాలా స్కూళ్లలో మైక్రోస్కోప్ పనిచేయడం లేదని, తాను కుల్కచర్ల పాఠశాలను సందర్శించిన సమయంలో గుర్తించడం జరిగిందని ఎంపీ తెలిపారు. సరూర్‌నగర్‌లో ఓల్డ్ స్కూల్ బిల్డింగ్ కూల్చివేయడం జరిగిందని, కొత్త భవనం నిర్మించినా టాయ్‌లెట్స్ నిర్మాణాలు పూర్తి చేయక పోవడంపై ఇబ్బందులు నెలకొంటున్నట్లు దిశ సభ్యులు తెలిపారు. నాలుగేళ్లుగా జిల్లాలో కిచెన్ షెడ్ల నిర్మాణం ఎందుకు పూర్తి కావడం లేదని డీఈవోను ఈ సందర్భంగా ప్రశ్నించారు.

చేపలు పట్టడం రాదు..

జిల్లాలోని మత్స్యకారులకు చేపలు పట్టడం రాదని ఎంపీ ఆరోపించారు. దీనికి స్పందించిన జిల్లా మత్స్య శాఖ అధికారి.. చేపలు పడతారని తెలిపారు. దీన్ని చాలెంజ్‌గా తీసుకున్న ఎంపీ.. రేపు చెరువుల వద్దకు పోదాం.. చేపలు పట్టడం వస్తుందో రాదో తెలుస్తుందని పేర్కొన్నారు. జిల్లాలోని చెరువుల్లో ఆంధ్రా, ఇతర రాష్ట్రాల నుంచి దళారీలు వచ్చి సొసైటీలను లీజుకు తీసుకుని చేపలు పట్టడంతో వారికి లాభం చేకూరుతుందన్నారు. జిల్లాలోని మత్స్యకారులకు చేపలు పట్టే విధానంపై పూర్తి స్థాయిలో శిక్షణ ఇప్పించి కావాల్సిన వలలను కూడా అందజేయాలని సూచించారు.

రేషన్ డీలర్లు షాపులు నడిపించడం లేదు..

రేషన్ డీలర్లు చాలావరకు షాపులు నడిపించడం లేదని, ఇతరులతో కొనసాగిస్తున్నారని సభ్యులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. బియ్యం పంపిణీలో సమయపాలన పాటించడం లేదని ఆరోపించారు. జిల్లాలో 5.78 రేషన్ కార్డులు ఉన్నాయని, మూడు నెలలకు సంబంధించి 45 వేల మెట్రిక్ టన్నుల సన్న బియ్యాన్ని లబ్ధిదారులకు అందజేసినట్లు డీఎస్‌వో వనజాత తెలిపారు. అదేవిధంగా జిల్లాలో 6,770 కొత్త రేషన్ కార్డులు వచ్చాయని, అలాగే యూనిట్ యాడింగ్‌కు సంబంధించి 1.48 లక్షలు ఉన్నట్లు తెలిపారు.

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు స్థానికులకు ఇవ్వాలి..

జిల్లాలో డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపులో స్థానికులకే మొదటి ప్రాధాన్యమివ్వాలని ఎంపీ సూచించారు. జిల్లాలో 3.75 లక్షల దరఖాస్తులు ఇందిర్మ ఇళ్ల కోసం వచ్చాయని, 45 వేలు స్థలం ఉన్న లబ్ధిదారులకు కేటాయించామని, 1.08 లక్షల ఇళ్లు స్థలం లేని వారికి మంజూరు చేసినట్లు హౌజింగ్ పీడీ డీసీ నాయక్ తెలిపారు. చేవెళ్ల నియోజకవర్గానికి 3500 ఇళ్లు, జిల్లాకు మొత్తంగా 17వేల ఇళ్లను కేటాయించినట్లు పేర్కొన్నారు. రూ.5లక్షలతో ఇల్లు పూర్తి కావడం సాధ్యపడటం లేదని సభ్యులు తెలిపారు. ఇసుక కొరత కారణంగా లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని, వ్యాపారులు ఎక్కువ ధరకు ఇసుకను అమ్ముతున్నారని సభ్యులు ఆరోపించారు.

వెటర్నరీ డాక్టర్లు అందుబాటులో ఉండటం లేదు

జిల్లాలోని ఆయా ఆసుపత్రుల్లో పశు సంవర్ధక శాఖ అధికారులు అందుబాటులో ఉండడం లేదని దిశా కమిటీ సభ్యులు కలెక్టర్ దృష్టికి తేగా, ఆయన స్పందిస్తూ గోపాలమిత్ర పథకంలో భాగంగా అధికారులు నిరంతరం అందుబాటులో ఉండి పశువులకు సత్వరమే వైద్య సేవలు, రైతులకు సలహాలు అందించాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే సిబ్బంది కొరత ఉందని జిల్లా వెటర్నరీ అధికారి డాక్టర్ మధుసూధన్ ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. షాబాద్ మండలం రేగడి దోస్వాడ పశువైద్య కేంద్రం శిథిలావస్థకు చేరుకుందని, మరమ్మతులు చేయించాలని దిశ సభ్యులు కోరారు. గోపాల మిత్రలు పశువైద్యంలో అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నారని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. జాతీయ వ్యవసాయ మార్కెట్(ఈ-నామ్) పథకం అమలు కావడం లేదని ఎంపీ తెలిపారు. గుడిమల్కాపూర్ మార్కెట్‌లో దళారులతో రైతులు ఇబ్బందులు పడుతున్నట్లు ఈ సందర్భంగా సభ్యులు తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, డీఆర్డీవో పీడీ శ్రీలత, డీపీవో సురేష్ మోహన్, జెడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, వ్యవసాయ శాఖ అధికారి ఉష, ఉద్యానవన శాఖ అధికారి సురేష్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి : యాదయ్య



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

శంకర్‌పల్లి, జూలై 18(ఆంధ్రజ్యోతి): గ్రామాలను అభివృద్ధి పథంలో నిలిపేందుకు కృషి చేస్తానని చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య తెలిపారు. మండల పరిధిలోని ఎల్వర్తి గ్రామంలో రూ.41.60 లక్షలతో చేపట్టే సీసీ రోడ్డు పనులను శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రయత్నిస్తానన్నారు. గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని వివరించారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే గ్రామాలు అభివృద్ధి పథంలో పయనించాలని అన్నారు. అన్ని వర్గాల అభ్యున్నతికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అహర్నిషలు పాటుపడుతున్నారని తెలిపారు. వ్యవసాయం మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గోవిందమ్మ గోపాల్‌రెడ్డి, మాజీ చైర్మన్ పాపారావు, మాజీ సర్పంచ్ సత్యనారాయణ, నర్సింలు, మాజీ ఉపసర్పంచ్ విక్రమ్‌రెడ్డి, నాయకులు సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, విఠలయ్య, వెంకటేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

కళాశాల భవన నిర్మాణం పూర్తి చేయాలి

ఆమనగల్లు, జూలై 18(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల అసంపూర్తి భవన నిర్మాణం పూర్తి చేసి వినియోగంలోకి తేవాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు కోరారు. ఈ మేరకు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డిని శుక్రవారం ఆయన నివాసంలో కలిసి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రణయ్, శంకర్‌లు నాయకులతో కలిసి వినతి పత్రం అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి త్వరగా భవన నిర్మాణం పూర్తయ్యేలా చూస్తానని చెప్పినట్లు నాయకులు తెలిపారు. డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శివశంకర్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు చరణ్, శివ, నాయకులు కుర్మిద్ద శివ, వంశీ తదితరులున్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

చౌదరిగూడ, జూలై 18(ఆంధ్రజ్యోతి): జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను ముస్లింలు సన్మానించారు. వారు మాట్లాడుతూ ఈ ఏడాది పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచడంతోపాటు వారు పూర్తిస్థాయిలో పాఠశాలకు హాజరయ్యేలా విద్యార్థుల తల్లిదండ్రులను అవగాహన కల్పించడం చాలా సంతోషమన్నారు. చౌదరిగూడ పాఠశాలలో 120కి పైగా విద్యార్థులు ప్రైవేట్ పాఠశాల నుంచి తిరిగి ప్రభుత్వ పాఠశాలలో చేరడం ఉపాధ్యాయులు కృషితోనే సాధ్యమైందన్నారు. జీహెచ్ఎం సునీత, ముస్లింలు అఫ్రోజ్ అలీ, అజ్జు, ఖయ్యూం, టీచర్లు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ముస్లింలు

హనుమాన్ ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందిస్తున్న మాధవీ లక్ష్మీకాంత్‌రెడ్డి

చేవెళ్ల, జూలై 18 (ఆంధ్ర జ్యోతి): హనుమాన్ ఆలయ నిర్మాణంలో భాగస్వాములు కావాలని దేవరంపల్లి మాజీ సర్పంచ్ నరహరి రెడ్డి కోరారు. శుక్రవారం మండల పరిధిలోని దేవరంపల్లి గ్రామంలో గల హనుమాన్ దేవాలయం నిర్మాణానికి మండల పరిధిలోని ఎన్కెపల్లి మాజీ ఎంపీటీసీ వనం మాధవీ లక్ష్మీకాంత్‌రెడ్డి దంపతులు గ్రామానికి వెళ్లి ఆలయ నిర్వాహకులకు రూ.2 లక్షల విరాళం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హనుమాన్ ఆలయం అభివృద్ధికి విరాళం ఇవ్వడం చాలా సంతోషంగా ఉందన్నారు. దాతలు ముందుకు వచ్చి ఆలయ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు. సీనియర్ నాయకులు మాణిక్యరెడ్డి, మల్లేష్, రవీందర్‌రెడ్డి, హన్మంత్‌రెడ్డి, మల్లారెడ్డి, రఘుపతిరెడ్డి, నరేందర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, అనంతరెడ్డి, బాల్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, బాల్‌రెడ్డి, గ్రామస్తులు ఉన్నారు.

పోచమ్మ ఆలయ నిర్మాణానికి..

కేశంపేట, జూలై 18(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని లింగంధన గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న పోచమ్మ ఆలయానికి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ఎడ్మ రాంరెడ్డి శుక్రవారం అలయ కమిటీ సభ్యులకు రూ.1,02,116 విరాళం అందించారు. గ్రామదేవత ఆలయ నిర్మాణానికి తనవంతు సహకారం అందించినట్లు ఆయన తెలిపారు. డమ్మడయ్య, నాగిళ్ల చిన్న రామస్వామి, ఎన్. పెద్దకృష్ణయ్య, జంగయ్య, కృష్ణ, సురేందర్, బాలస్వామి, చంద్రయ్య, బాలు, శ్రీనివాస్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, విష్ణు, అంజయ్య, ఇస్తారి తదితరులు పాల్గొన్నారు.

పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి

- టీడీపీ రాష్ట్ర నాయకుడు వంగాల కృష్ణ

మంచాల, జూలై 18(ఆంధ్రజ్యోతి): పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని టీడీపీ రాష్ట్ర నాయకుడు వంగాల కృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టీడీపీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొంగర వెంకట్‌రెడ్డి, పగడాల ఆనంద్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి సీహెచ్ చక్రపాణిలతో కలిసి ఆయన మంచాలలో విలేకరులతో మాట్లాడారు. మంచాల మండల పరిధిలోని 23 గ్రామపంచాయతీలకు చెందిన సుమారు మూడు వేల మంది నిరుపేదలు ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రజాపాలన సదస్సుల్లో అర్జీలు పెట్టుకున్నారని, అధికార పార్టీకి చెందిన వారికే ఇళ్లు మంజూరు చేస్తున్నారన్నారు. లింగంపల్లిగేటు వద్ద నిర్మితమై ఉన్న డబుల్‌బెడ్‌రూం ఇళ్లు పంపిణీకి నోచుకోవడం లేదన్నారు.